# సీఎం సహాయనిధికి ఓయూ ఉద్యోగుల విరాళం

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఓయూ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం రిజిస్ట్రార్ ప్రొ. కె. ప్రతాప్‌రెడ్డి, ఓయూ ఫైనాన్స్ ఆఫీసర్ దయానిధి, టీఎన్‌జీఓ అధ్యక్షులు దేవిప్రసాద్‌లు కలిశారు. సీఎం సహాయనిధికి పద్నాలుగు లక్షల ముప్పైఆరు వేల ఏడువందల అరవై రూపాయల చెక్కును సీఎం కేసీఆర్‌కు అందజేశారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాడానికి ఈ విరాళం ఉపయోగించాలని ఈ సందర్భంగా వారు సీఎంను కోరారు. అనంతరం వారు విశ్వవిద్యాలయం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విశ్వవిద్యాలయానికి అందించే బ్లాక్‌గ్రాంట్‌ను రూ.330 కోట్లకు పెంచాలని కోరారు. ఉద్యోగులకు జీతాలు ఇచ్చేపరిస్థితి లేదని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఓయూ బ్లాక్‌గ్రాంట్‌ను పెంచుతానని సీఎం హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు. 2018లో ఓయూ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సీఎంను కోరారు. తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కంచి మనోహర్, ఉద్యోగ సంఘం నేతలు పార్థసారథి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి విరాళం అందజేస్తున్న ఓయూ రిజిస్ట్రార్, ఉద్యోగులు